క్లుప్తంగా

పోలేరమ్మ దేవాలయంలో అన్నసంతర్పణ



బాపట్ల: బాపట్ల అధిష్టాన దేవత పోలేరమ్మ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా భారీ అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం మహిళలు 108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు. విశేష అభిషేకం, అర్చన, మహా కుంభ హారతి, భక్తులకు అన్న సంతర్పణ ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. మూడు రోజులుగా చేపట్టిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు భారీగా పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కనీస జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలు దూరం

అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు



రేపల్లె రూరల్: కనీస జాగ్రత్తలు పాటించటంతో అగ్ని ప్రమాదాలను దూరం చేయవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైలు, బస్సు వంటి వాటిలో ప్రయాణించే సమయంలో పెట్రోలు, కిరోసిన్, గ్యాస్ వంటి పదార్థాలను తీసుకెళ్లరాదన్నారు. ట్రాక్టర్లలో మితిమీరిన గడ్డిని తీసుకెళ్లటంతో పొరపాటున గడ్డి విద్యుత్ తీగలకు తగిలి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. ఇళ్లలో చిన్న చిన్న జాగ్రత్తలు పాటించితే ఎటువంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలను అదుపు చేసేందుకు ఉపయోగించే పరికరాల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత మృతి

పెళ్లైన పది నెలలకే మృతి చెందిన వైనం



రాజకుమారి మృతదేహం

కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర గ్రామ శివారు గుదిబండివారి పాలెంలో వివాహిత ఉరి వేసుకుని మృతి చెందింది. పెళ్లైన పది నెలలకే, అందునా ఐదు నెలల గర్భవతి అయిన ఆమె మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు రాజకుమారి (18) ఆదివారం మధ్యాహ్నం ఉరికి వేలాడుతూ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. రాజకుమారి స్వగ్రామం భట్టిప్రోలు మండలంలోని పెదపాలెం గ్రామం. సుమారు 10 నెలల క్రితం గుదిబండివారిపాలెం గ్రామానికి చెందిన యువకుడు సుందరరాజును ప్రేమ వివాహం చేసుకుంది. ఇరు పక్షాలను ఒప్పించి పెళ్లి చేసుకున్న రాజకుమారి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో భర్తతో స్వల్ప ఘర్షణ జరగడంతో లోపలికి వెళ్లి తలుపు వేసుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆర్. ఉమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజకుమారి, సుందరరాజు కుటుంబాలు చర్చలు జరుపుకుంటున్నాయి. ఆదివారం రాత్రి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

తెనాలిరూరల్: అగ్నిమాపక వారోత్సవాలు ముగిశాయి. ఈ నెల 14వ తేదీ నుండి వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలను అగ్నిమాపక అధికారులు నిర్వహించారు. ముగింపు సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది కుటుంబసభ్యులకు ప్రమాదాల నివారణ గురించి వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళనకు గురికాకుండ, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బయటపడేందుకు పాటించాల్సిన సూత్రాల గురించి ఇన్చార్జి అగ్నిమాపక అధికారి కోటిరెడ్డి వివరించారు.

పద్మశాలి వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెంలోని పద్మశాలియ కల్యాణ మండపంలో నిర్వహించిన 14వ వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా తొలుత వివాహ పరిచయ వేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జె. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు, కోశాధికారి దివి పురుషోత్తం, ఉపాధ్యక్షుడు అక్కల శ్రీరామ్, కృష్ణారావు, దామర్ల పరమేశ్వరరావు, నరేంద్ర బాబు, దీవి హేమంత్, ఓంకార్ పాల్గొన్నారు.

గడువు తీరితే ముప్పే





సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీ

- వంట గ్యాస్ సిలిండరుకూ కాలపరిమితి
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

బాపట్లటౌన్ : గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండర్లకూ కాలపరిమితి ఉంటుందని, దానిని గమనించాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండర్లు వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండరు మార్చుతున్నప్పుడల్లా ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.

ఇలా గుర్తించాలి...

ఉదాహరణకు సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ–24 అని ఉంటే, ఆ సిలిండర్ 2024 మార్చికి ఎక్స్‌పైర్ అవుతుందని అర్థం. 24 అంకె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుంచి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు, డీ అక్షరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు నెలలను సూచిస్తాయని గుర్తించాలి.

ఇవి తెలుసుకోవాలి...

గ్యాస్ సిలిండర్‌పై వినియోగదారులకు హక్కులు ఉన్నాయి. గ్యాస్ కనెక్షన్ కలిగిన వినియోగదారుడు మృతి చెందితే వారి కుటుంబ సభ్యుల పేరిట ఆ కనెక్షన్ మార్పు చేసుకోవచ్చు. కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే అదే రోజు కనెక్షన్ పొందవచ్చు. కొత్త కనెక్షన్ తీసుకునే సమయంలో తమ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలని డీలర్ కోరవచ్చు. అయితే డీలర్ వద్దనే స్టౌ కొనుగోలు చేయాలన్న నిబంధన ఏమీ లేదు. అంతేకాక గ్యాస్ ఏజెన్సీ నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్ ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని గుర్తించాలి. గడువు తేదీ ముగిసినా.. నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండర్‌ను అడిగి తీసుకునే హక్కు వినియోగదారులకు ఉంది.

పదేళ్ల గడువు

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న తరువాతే సిలిండర్ మార్కెట్లోకి వస్తుంది.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



మృతుడు కనకారెడ్డి(ఫైల్)



మృతుడు కనకారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకట శివకుమార్

చందోలు(కర్లపాలెం): చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పిట్టలవాని పాలెం మండలంలోని అలకాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. చందోలు ఎస్‌ఐ ఎం.వెంకట శివకుమార్ తెలిపిన వివరాల మేరకు అలకాపురం గ్రామానికి చెందిన బేతాళం వెంకట కృష్ణంరాజు రొయ్యల చెరువులో ట్రాక్టర్లతో మరమ్మతులు చేయిస్తున్నారు. ఆదివారం చెరువు కట్టపై మరమ్మతులు చేస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ చెరువులోకి బోల్తా పడటంతో డ్రైవర్ అక్కల కనకారెడ్డి(50) ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు అక్కల కనకారెడ్డి కర్లపాలెం మండలం గణపవరం పంచాయతీ చినపులుగువారిపాలెంకు చెందిన అక్కల కృష్ణారెడ్డి కుమారుడు. నిరుపేద కుటుంబానికి చెందిన కనకారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమార్తె శివలీల, కుమారుడు రామాంజనేయరెడ్డి ఉన్నారు. మృతుని భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేయించేందుకు మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృథాను అరికట్టండి..!



లీక్ ద్వారా వృథాగా పోతున్న తాగునీరు

రేపల్లెరూరల్: పట్టణంలో మున్సిపల్ ప్రధాన పైప్ లైన్లకు ఏర్పడుతున్న లీకులతో తాగునీరు వృథాగా పోతుంది. లీకేజీలను శాశ్వతంగా అరికట్టడంలో మున్సిపల్ అధికారులు విఫలం అవుతుండడంతో వేలాది లీటర్ల తాగునీరు నిత్యం మురుగు కాలువల పాలవుతుంది. గత ఆరు నెలల క్రితం పద్మశాలి కల్యాణ మండపం సమీపంలో ఏర్పడిన లీకుని నివారించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారు. దీని ద్వారా నిత్యం వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటిమట్టం తగ్గుతుండడంతో పట్టణంలోని పలు వార్డులకు పూర్తిగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే నీటి వృథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి లీకులను సరిచేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మే 10న పాలపర్రు హైస్కూల్ వజ్రోత్సవాలు



వజ్రోత్సవ ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న రత్తయ్య తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పెదనందిపాడు మండలం పాలపర్రులోని శ్రీ నరసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలను మే 10న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య తెలిపారు. ఆదివారం లక్ష్మీపురంలోని కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమ లోగో, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్తయ్య మాట్లాడుతూ.. 1950లో ముద్దన చెంచయ్య సంస్కృత పాఠశాలగా ప్రారంభించిన పాఠశాల అనంతరం ప్రభుత్వ పాఠశాలగా రూపాంతరం చెందిందని తెలిపారు. వేలాది మంది విద్యాభ్యాసం చేసి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. పూర్వ విద్యార్థులందరూ వజ్రోత్సవ వేడుకలు, పాఠశాల పూర్వ వైభవానికి చేయూత అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. వజ్రోత్సవ కార్యక్రమాల కమిటీ నాయకుడు డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పాలపర్రు పాఠశాల ఆవరణలో 'సెలబ్రేటింగ్ ది పాస్ట్–ఇన్‌స్పైరింగ్ ది ఫ్యూచర్' అనే అంశంతో మే 1న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అక్కడ పనిచేసిన పూర్వ ఉపాధ్యాయుల సత్కారం, వివిధ అంశాల్లో పోటీలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ పూర్వ అధ్యక్షులు, కార్యదర్శి మణికుమార్, బండ్లమూడి మధుసూదన్‌రావు, దుద్దెంపూడి సత్యనారాయణ, పెద్ది మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక



1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



గురువులతో 1991-92 బ్యాచ్ విద్యార్థులు

ప్రత్తిపాడు: పది కాదు ఇరవై కాదు.. దాదాపుగా యాభై సంవత్సరాల తరువాత వారంతా అదే పాఠశాల సాక్షిగా కలవడంతో ఆనాటి హృదయాల్లో ఆనంద గీతం వెల్లివిరిసింది. ఆలింగనాలు, ఆప్యాయత ప్రేమాను రాగాలతో ఒక రోజు ఆనందంగా గడిచిపోయింది. ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఒకప్పటి పిల్లలమేనంటూ అందరి మదిలోనూ అలనాటి అల్లరి జ్ఞాపకాలు హృదయసరోవరాల్లో నుంచి ఎగసిపడ్డాయి. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెం మాకినేని రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1973–74 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల 'స్వర్ణోత్సవ ఆత్మీయ కలయిక ' ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. సుమారు 27 మంది పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఒకచోట కలవడంతో ఆనంద లోగిలిలో తేలియాడారు. బాల్యంలో చేసిన అల్లర్లు, సరదా సంగతులు, చెట్ల కింద చదువులు, చేసిన షికార్లు.. అన్నింటినీ మరోమారు నెమరవేసుకుని పులకించిపోయారు. ఇప్పుడు ఆరు పదుల ప్రాయంలోకి చేరువ అయినప్పటికీ, చమర్చిన కళ్లతో చిన్ననాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. కుటుంబ నేపథ్యం .. తదితరాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. మరపురాని స్నేహబంధాన్ని సెల్ఫీలుగా తీసుకుని మురిసిపోయారు. అప్పటి బ్లాక్ అండ్ వైట్ గ్రూప్ ఫొటోలను చూసుకుని కళ్లు తడుపుకొన్నారు. గతించిన గురువులు, మిత్రులను స్మరించుకున్నారు.

ఏబిపాలెం పూర్వ విద్యార్థులు..

ఏబిపాలెం హైస్కూలులో 1991–92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో అపూర్వంగా జరిగింది. చిన్ననాటి మిత్రులంతా ఒకే వేదికపై ఆటలాడి, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు.

ఘనంగా పునరుత్థాన పర్వదిన వేడుకలు



పేరలి ప్రార్థనా మందిరంలో వాక్యం చెబుతున్న పాస్టర్ ఏసుబాబు



ప్రత్యేక ప్రసంగం చేస్తున్న వాక్య సందేశకులు రెవ.జాయ్ కుమార్



కొల్లూరు లూథరన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు



చావలి బాప్టిస్టు చర్చిలో ప్రార్థనల్లో భక్తులు

చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు



రేపల్లెలో సందేశం ఇస్తున్న జాన్ రెబ్బా



వేమూరులో సందేశం ఇస్తున్న పాస్టర్



యాజలి ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

రేపల్లె రూరల్: ఈస్టర్ పర్వదిన వేడుకలను నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్ (ఐఆర్‌ఈఎఫ్) చర్చిలో నిర్వహించిన ఈస్టర్ పర్వదిన వేడుకల్లో జాన్ రెబ్బా ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. కరుణామయుడైన ఏసు పునరుత్థానం చేయబడిన రోజునే ఈస్టర్ పండుగగా జరుపుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని యందు విశ్వాసం ఉంచాలన్నారు. ప్రేమ, కరుణ, దయలు యేసు మార్గాలన్నారు. సాటి జీవుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, శత్రువుల పట్ల సైతం క్షమాపణ ఇవన్నీ జీసస్ తన జీవితం ద్వారా మానవులకు ఇచ్చిన మహోన్నత సందేశాలన్నారు. పాపుల పాపాలను తొలగించేందుకే అవనిపై అడుగుపెట్టి తన రక్తాన్ని చిందించి పాప ప్రక్షాళన చేశారన్నారు. కార్యక్రమంలో విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఏఈఎల్‌ఈ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బాపట్ల సీబీజెడ్ చర్చిలో...

బాపట్ల: స్థానిక సీబీజెడ్ చర్చిలో ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం జరిగాయి. సన్‌రైజ్ సర్వీస్, వాక్య సందేశకులు రెవ.ఎ.ఇ.జాయ్ కుమార్ (డైరెక్టర్ సీఎల్ఎఫ్, కాకినాడ) ప్రసంగించారు. క్రీస్తు మరణాన్ని జయించి సత్యం రూపంలో మన చెంతనే ఉన్నాడని తెలిపారు. హింస, ద్వేషాలు మరణాన్ని మాత్రమే ఇస్తాయని, ప్రేమ క్షమాపణలు జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయని తెలియజేశారు. ఇది నిరూపించటానికి సమాధి నుంచి క్రీస్తు ప్రభువు సజీవుడై లేచి వచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో రేవ పవిత్ర కుమార్, రెవ. రాహుల్ దేవ్, జె.సాధు హెర్బర్ట్, జె.క్రిస్టఫర్, ప్రేమ్‌చంద్, ఎలేషియా తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో...

కొల్లూరు : ఈస్టర్ పర్వదిన వేడుకలు మండలంలో అత్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించారు. ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు తెల్లవారుజామునే తమ పూర్వీకులను స్మరించుకునేందకు శ్మశాన వాటికలకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి అలంకరించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల చర్చిలు, ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు జరపడంతోపాటు, పాస్టర్ల బోధనలు, బైబిల్ సారాంశాలను ఆలకించారు. కొల్లూరులోని లూథరన్ చర్చి, రక్షణ ఆర్మీ చర్చి, బాప్టిస్టు చర్చిలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనలలో పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు ప్రభువు కల్వరి సిలువపై తన రక్తాన్ని చిందించి మరణించి తిరిగి సమాధి నుంచి లేచిన రోజును ఈస్టర్ పండుగగా క్రైస్తవులు జరుపుకుంటున్నారు. యాజలి లూథరన్ చర్చిలో పాస్టర్ శశికాంత్, పేరలి రక్షణ సైన్యం చర్చిలో పాస్టర్ ఏసుబాబు ప్రభువు చేసిన త్యాగాన్ని విశ్వాసులకు వివరించారు. పండుగ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలింగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని యాజలి, బుద్దాం, కర్లపాలెం, బిడారుదిబ్బ, చింతాయపాలెం, గణపవరం, కట్టావాద, పేరలిపాడు, పేరలి, నక్రావారిపాలెం, నల్లమోతువారిపాలెం గ్రామాలలోని క్రైస్తవ దేవాలయాలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేమూరులో...

వేమూరు: క్రైస్తవులందరు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, అమర్తలూరు చుండూరు మండలాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులందరు తెల్లవారుజామున తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువు గుడ్ ఫ్రైడే రోజున సిలువలో మరణించి మూడో రోజున తిరిగి సమాధి నుంచి బయటకు రావడం జరిగింది. అందువల్ల ఈస్టరు రోజున క్రైస్తవులందరు సమాధులను శుభ్రం చేయడం జరుగుతుంది. ఉదయం 11 గంటల నుంచి అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాలకు ఘన నివాళి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని సమాధుల తోటలో ఆదివారం తెల్లవారుజామున పాస్టర్ ప్రవీణ్ పగడాలకు పాస్టర్ సురేష్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రార్థన చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని విచారణ వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీ, ఉన్నం లక్ష్మయ్య పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

చినకాకాని (మంగళగిరి): విపత్కర పరిస్థితులలో సామాజిక బాధ్యతతో మెలుగుతూ ప్రజలకు అండగా నిలవడమే జన సేవాదళ్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో పది రోజులుగా సాగుతున్న జన సేవాదళ్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ.. పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన పండుగలా వేడుకలు జరుపుకోవాలన్నారు. దేశంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులలో రెడ్ షర్ట్ వలంటీర్ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, గుజ్జుల ఈశ్వరయ్య, కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

కాలువ మట్టి.. చేనుకు మెరక!

యథేచ్ఛగా తవ్వకాల్లో కూటమి నాయకుడు



కట్టను తవ్వి పొలంలో మెరక చేసుకుంటున్న దృశ్యం

పెదకాకాని: పాలించేవాడు మనవాడైతే ఏం చేసినా అడ్డు చెప్పేవారే ఉండరన్న చందంగా స్థానిక కూటమి నాయకులకు కాలం సాగుతుంది. మండంలోని తక్కెళ్లపాడు వాటర్ ట్యాంక్ సమీపంలో గుంటూరు చానల్(కొత్త కాలువ) కట్టను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రైతు చేబ్రోలు అప్పారావు ప్రొక్లెయిన్‌తో తవ్వించి తన చేనుకు మెరక వేసుకుంటున్నారు. ఈ ఏడాది అధికంగా కురిసిన వర్షాలకు కాలువ కట్టలు బలహీనంగా మారడంతో పాటు కాలువ కట్టకు పలు చోట్ల గండ్లు పడి వరి పొలాల్లోకి నీరు చేరి పైర్లు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ కాలువ కట్టలను ఎటువంటి పటిష్టం చేయకపోగా ఆదివారం గ్రామానికి చెందిన ఆయన ఏకంగా కట్టను తవ్వి ఆ మట్టిని ట్రాక్టర్లతో తన పొలంలోకి చేర్చుకున్నారు. కాలువ కట్ట దెబ్బతింటుందని భావించిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ప్రాంతానికి గ్రామ వీఆర్వో జగదీష్, కాలువ కట్టలకు సంబంధించిన లష్కర్ శ్రీనులు చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. అప్పటికే 50 ట్రక్కులకు పైగా కాలువ మట్టిని తన పొలంలోకి తరలించేశారు. దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ కొత్తపేటలోని ఓ లాడ్జిలో బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు తన సిబ్బందితో కలసి ఆకస్మిక దాడులను శనివారం రాత్రి నిర్వహించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న వలసల శ్రీనివాసరావు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని ల్యాప్‌టాప్, ట్యాబ్, మూడు సెల్‌ఫోన్లు, రూ. 11,860 స్వాధీనపర్చుకున్నారు. అరెస్ట్ వివరాలను ఆదివారం రాత్రి సీఐ తెలిపారు. బెట్టింగ్ నిర్వహిస్తే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.